కానరాని నీటి సరఫరా సిబ్బంది

పట్టించుకోని జోన్‌–3 ఇంజినీర్లు

ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహన చోదకులు

ఎక్కడి మట్టికుప్పలు అక్కడే


నక్కవానిపాలెంలో రోడ్డు పక్కనే పేరుకుపోయిన మట్టికుప్పలు


గురుద్వార వెనుక రోడ్డుపై మట్టికుప్పలు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్‌–3 నీటి సరఫరా విభాగం సిబ్బంది **ఎక్కడ** ఉన్నారో **గాని,** నియోజకవర్గంలోని మట్టికుప్పలకు మాత్రం మోక్షం కలగకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. **ఏ** వీధిలోనూ **పైప్‌లైన్ల** కోసం తవ్విన **గోతులను** సక్రమంగా **పూడ్చడం లేదని** సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా మట్టికుప్పలు రోడ్డు మీదే ఉండిపోయినా తరలించే నాథుడు కరువయ్యాడు. ఒకవైపు స్వచ్ఛభారత్ అంటూ ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించే జీవీఎంసీ **అధికారులు ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారని** సర్వత్రా విమ**ర్శలు** వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలోని 14, 24 వార్డుల పరిధిలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్, నక్కవానిపాలెం, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, **గురు**ద్వారా తదితర **ప్రాంతాల్లో** మట్టికుప్పలు **పేరుకుపోతున్నా అధికారులకు** మాత్రం చీమ కుట్టినట్టయినా లేకపోవడం గమనార్హం. నక్కవానిపాలెంలోని రోడ్డును ఆనుకుని ఉన్న రోడ్డంతా మట్టికుప్పలతో పేరుకుపోవడంతో రాత్రి పూట వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు ఏం చేస్తున్నారో గాని మట్టికుప్పల తరలింపునకు మాత్రం మోక్షం కలగడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. గురుద్వార వెనుక రోడ్డుపై ఎక్కడ చూసినా మట్టికుప్పలే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తమవుతోంది. పలు ప్రాంతాల్లో ఇంకా మట్టికుప్పలు తరలించడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా జీవీఎంసీ జోన్‌–3 నీటి సరఫరా విభాగం అధికారులకు మాత్రం చెవికెక్కడం లేదని అంటున్నారు. జీవీఎంసీ జోన్‌–3 నీటి సరఫరా విభాగం అధికారులు ఇప్పటికైనా స్పందించి నియోజకవర్గంలో పేరుకుపోయిన మట్టికుప్పలను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు..

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో అమృత్ స్కీమ్ కింద పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. కానీ పూడ్చిన గోతుల వద్దే మట్టికుప్పలు ఇష్టానుసారం వదిలేశారు. వారాలు గడుస్తున్నా సరే వాటిని తరలించడం లేదు. ఫలితంగా వాహన చోదకులకు ఇబ్బందిగా వుంది.

– ఎ.లక్ష్మణరావు, బాలయ్యశాస్త్రి లేఅవుట్

మట్టిమయంగా రోడ్లు..

అమృత్ స్కీమ్ కింద పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అందుకోసం తవ్విన రోడ్లు సక్రమంగా పూడ్చలేదు. ఫలితంగా రోడ్లమీదే కుప్పలు దర్శనమిస్తున్నాయి. వెంటనే జోన్‌–3 నీటి సరఫరా విభాగం ఇంజినీర్లు స్పందించి మట్టికుప్పలు తరలించాలి.

– ఎం.వెంకట్, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్

పనిచేయని బోరు


రాధాకృష్ణ లేఅవుట్ రోడ్డులో పనిచేయని బోరు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు రాధాకృష్ణ లేఅవుట్ రోడ్డులోని ఒక బోరు కొన్నేళ్లుగా పనిచేయడం లేదు. వేసవి ఎండలు మండిపోతున్న తరుణంలో నీరు దొరక్కపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ 27వ నంబర్ గల బోరు మూలకు చేరడంతో రాధాకృష్ణ నగర్ మురికివాడ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడి కుటుంబాలకు తాగునీటి కోసం ఈ బోరే ఆధారం. చాలా కాలంగా ఇది పనిచేయకపోవడంతో నీటి కోసం దూరంగా ఉన్న బోరు వద్దకు వెళ్లాల్సి వస్తోంది. వేసవి నేపథ్యంలో జీవీఎంసీ జోన్‌–3 నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి ఈ బోరుకు తక్షణం మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

పరిశుభ్రంగా వాకర్స్ పార్కు


పార్కులో శ్రమదానం చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో వార్డు శానిటరీ సిబ్బంది సహకారంతో వాకర్స్, క్లబ్ సభ్యులతో కలిసి సంయుక్తంగా శ్రమదానం చేశారు. ఎండా కాలం కావడంతో రాలిన చెట్ల ఆకులు ఎక్కడబడితే అక్కడ పేరుకుపోయాయి. వీటి వల్ల విషపురుగులు చేరి వాకర్స్, సందర్శకులకు హాని కలిగించే అవకాశం ఉంది. ఈ మేరకు చెత్తను పూర్తిగా తొలగించారు. మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారు.

వీధిలైటు వెలగక ఇబ్బందులు


నెల రోజులుగా వెలగని వీధిలైటు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం వాటర్ ట్యాంక్స్ ఎదురు వీధిలోని సాయిస్రవంతి ఎలిజెన్స్ అపార్ట్‌మెంట్ పక్కనున్న విద్యుత్ లైట్ (పోల్ నంబర్ ఎస్ఎస్ 123/ఏ) సుమారు నెల రోజులుగా వెలగడం లేదు. దీంతో స్థానికులు రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై అధికారులకు తెలియజేసినా స్పందించలేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో చీకట్లో బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే స్ట్రీట్ లైట్ వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ


వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

మరబోట్లలో ట్రాన్స్‌పాండర్స్ వినియోగం తప్పనిసరి


మరబోట్లకు అమర్చిన ట్రాన్స్‌పాండర్లను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

మహారాణిపేట: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ప్రభుత్వం మొదటి విడతగా ఫిషింగ్ హార్బర్‌లో మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు 618 ట్రాన్స్‌పాండర్స్ నూరు శాతం సబ్సిడీపై సరఫరా చేసింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌పాండర్స్ వినియోగం, పనితనంపై మరపడవల యాజమానులు, డ్రైవర్లతో ఫిషింగ్ హార్బర్‌లో సమావేశం నిర్వహించారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌పాండర్స్ ఉపయోగించేటప్పుడు వచ్చే బ్యాటరీ సమస్యలు, కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన అంశాలపైన అవగాహన కల్పించారు. ట్రాన్స్‌పాండర్స్ వల్ల సముద్రంలో బోటు ఎక్కడ ఉన్నదీ, చేపల లభ్యత, బోటు ప్రమాదంలో ఉన్నప్పుడు సమాచారం తెలయజేయడానికి అవకాశం ఉందని జేడీ అన్నారు. అనంతరం జెట్టీలో మరబోట్లకు బిగించిన ట్రాన్స్‌పాండర్లను పరిశీలించారు. సైంటిస్టులు సునీల్ కుమార్, పలాష్ జోషి, రాఘవేంద్ర పరికరాల వినియోగంపై పలు సూచనలు చేశారు. టెక్నీషియన్లు సత్యనారాయణ, రవి కుమార్, ఎస్‌డీవో ఆశాజ్యోతి, అనురాధా (కాకినాడ) తదితరులు పాల్గొన్నారు.

అన్నావదినలపై దుర్భాషలు

విశాఖ సిటీ: అన్నావదినలను అసభ్య పదజాలంతో దూషించిన వ్యవహారంలో పోలీసులకు ఫిర్యాదు చేశారన్న కోపంతో సదరు వ్యక్తి మళ్లీ వదినపై దుర్భాషలతో రెచ్చిపోయాడు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా.. అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లో కుంచ గాయత్రి, కేవీవీఎన్ మూర్తి దంపతులు నివసిస్తున్నారు. మూర్తికి, తన సోదరుడు కె.పద్మనాభంతో ఆస్తి తగాదాలున్నాయి. ప్రస్తుతం కోర్టులో కేసులు నడుస్తున్నాయి. గత నెలలో పద్మనాభం.. తన వదిన గాయత్రిని పరుషంగా దూషించాడు. సోదరుడు మూర్తికి అంగవైకల్యం ఉండటంతో అతడిపై కూడా ఇష్టానుసారంగా మాట్లాడి కించపరిచాడు. దీంతో భార్యాభర్తలిద్దరూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి ఫిర్యాదు చేశారు. రికార్డు చేసిన పద్మనాభం మాటలను సీపీకి వినిపించారు. సీపీ వెంటనే పద్మనాభంపై కేసు నమోదు చేయాలని నాలుగో పట్టణ పోలీసులను ఆదేశించారు. పోలీసులు అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, స్టేషన్ బెయిల్‌పై పంపించారు. తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారన్న కోపంతో పద్మనాభం.. తమను మరింతగా దుర్భాషలాడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై మరోసారి సీపీని కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

'సే నో టు డ్రగ్స్' అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరిట అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ఆశీలమెట్ట జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.సతీష్‌నాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో తక్షణ ఉపాధి


విద్యార్థులతో మాట్లాడుతున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: టెన్త్ అనంతరం పాలిటెక్నిక్ విద్య అభ్యసించడం ద్వారా తక్షణ ఉపాధి అవకాశాలు పొందవచ్చని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్)లో పదో తరగతి విద్యార్థులకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి డిమాండు ఉందని పేర్కొన్నారు. పాలిసెట్‌కు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో మంచి ర్యాంకు రావాలంటే పాఠ్య పుస్తకాలపై ఆధారపడాలన్నారు. మెటీరియల్ కేవలం ఒక మార్గదర్శిగానే ఉపయోగపడుతుందన్నారు. పదో తరగతి పాఠ్య పుస్తకాలతో పాటు, పాత పరీక్ష పేపర్లు ప్రాక్టీసు చేయాలన్నారు. పాలిటెక్నిక్ కోర్సును మూడేళ్లు అభ్యసించాల్సి ఉంటుందన్నారు. కెమికల్ ఇంజినీరింగు, మెటలర్జీ కోర్సులు మూడున్నర సంవత్సరాలు చదవాల్సి ఉంటుందన్నారు. వీరు కోర్సు మధ్యలో ఏడాది పాటు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ పొందుతారని, ఇతర విభాగాల కోర్సుల్లో ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో పలువులు అధ్యాపకులు పాల్గొన్నారు.

శుభ్రపడిన గెడ్డలు


పూడికలు తొలగించిన అనంతరం రైల్వే న్యూకాలనీ గెడ్డ


80 ఫీట్ రోడ్డు వద్ద గెడ్డలో పూడికలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42,45 వార్డుల పరిధిలో గల పలు గెడ్డల పరిస్థితిపై 4వ తేదీ శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'గెడ్డలు ఘోరం' కథనానికి జీవీఎంసీ సిబ్బంది స్పందించారు. శుక్రవారం ఉదయం నుండి తాటిచెట్లపాలెం, 80 ఫీట్‌రోడ్డు, రైల్వేన్యూకాలనీలలో గల పలు గెడ్డల్లో పేరుకుపోయిన పూడికలు, వ్యర్థాలు, చెత్తను జేసీబీలతో, పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో తొలగించారు. తమ ప్రాంత పరిసరాలు పరిశుభ్రంగా మారడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తాటిచెట్లపాలెం బజార్ వద్ద గల గెడ్డకు రక్షణ గోడ లేకపోవడంతో స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి దీని విషయమై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వయసు పెరిగే కొద్దీ మతిమరుపు


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు


మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణి

మురళీనగర్: వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుందని గాయత్రి విద్యాపరిషత్ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, పాలియేటివ్ మెడిసిన్‌లో గ్లోబల్ ఫెలోషిప్ పొందిన డాక్టర్ శ్రావణి గద్దిపాటి అన్నారు. మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహసంధ్య ఏజీకేర్ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం వుడా కాలనీ ఈస్ట్ పార్కు సమావేశం మందిరంలో మతిమరుపు కారణాలు, నివారణ మార్గాలు అనే అంశంపై మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాల ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మతిమరుపు వచ్చిన వారిలో కొత్త విషయాలు నేర్చుకోలేకపోవడం, మనుషులను గుర్తుపట్టలేకపోవడం, వస్తువులు ఎక్కడ పెట్టారో మరిచిపోవడం, చెప్పిందే చెప్పడం, అడిగిందే అడగడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే కొన్ని రకాల చికిత్సా విధానాల ద్వారా మతిమరుపును నివారించే అవకాశముందన్నారు. సైకాలజిస్ట్ కె.రవికాంత్ మతిమరుపు కారణాలు, నివారణ మార్గాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అందరికీ వివరించారు. మంచి నిద్ర అన్ని సమస్యలకు ఉత్తమ ఔషధమని పేర్కొన్నారు. మెదడు పనిచేసే విధానాన్ని స్క్రీనింగ్ పరీక్ష ద్వారా తెలిపారు. డాక్టర్ శ్రావణి, రవికాంత్‌లను ఘనంగా సత్కరించారు. మహిళా క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్కు అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, కార్యదర్శి పి.కమల, కోశాధికారి ఎన్.శేషామణి, ఏజీకేర్ ఫౌండేషన్ ప్రతినిధులు రాహుల్, సత్య, చందనశాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసూర్యారాధన పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సెంచూరియన్ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు తదితరులు

సీతంపేట: విశాఖ సాహితీ 54వ వ్యవస్థాపక దినోత్సవం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగింది. ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి రచించిన శ్రీ సూర్యారాధన , దేవాలయాలు అనే పుస్తకాన్ని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఆరోగ్య సమతుల్యానికి సూర్య భగవానుడు ఎంతో మేలు చేస్తుంటాడని, అటువంటి సూర్య భగవానుడుకి సంబంధించిన విషయాలను పాండురంగ విఠల్ చాలా పరిశోధన చేసి ఒక మంచి పుస్తకాన్ని రచించారని కొనియాడారు. ఒక సాహితీ సంస్థ 54వ వ్యవస్థాపక దినోత్సవం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఇన్నేళ్లు మనుడగ సాగించడం చాలా గొప్ప విషయమన్నారు. ఘండికోట విశ్వనాథం పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి వై.వి.అనూరాధ, విశ్రాంత పోలీస్ అధికారి శ్రీరంగం దివాకర్, విశాఖ సాహితీ అధ్యక్షురాలు కోలవెన్ను మలయవాసిని, కార్యదర్శి శంకర్ నీలు, ఉపాధ్యక్షుడు డి.వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు పందిరి రాట


పందిరి రాట వేస్తున్న ఆలయ ధర్మకర్తలు, అధ్యక్షుడు


పందిరి రాట కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం రామాలయంలో ఈ నెల 6న ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం అర్చకుడు రామారావుశర్మ పర్యవేక్షణలో పందిరి రాట వేశారు. కార్యక్రమంలో నక్కవానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాత్రాజురెడ్డి, ఉపాధ్యక్షులు ఎండ్రెడ్ల వెంకటేశ్వరరెడ్డి రవికుమార్, కార్యదర్శి శ్యాం రెడ్డి, కోశాధికారి ధర్మాల గురుమూర్తిరెడ్డి, సంయుక్త కార్యదర్శి నందిక వేణురెడ్డి, టీడీపీ నాయకుడు బర్ల బాలకృష్ణ, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుందర అభయాంజనేయ ఆలయంలో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఈ నెల 6న శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆలయ ధర్మకర్త సీతారామారావు, జయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా పందిరి రాట వేశారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సీతారాముల కల్యాణం జరుపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఆళ్ల నరసింగరావు, అప్పలరాజు, దాసు, శ్రీరాములు, ఈశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ బాగ్చీ

మహారాణిపేట: విశాఖలో నేటి నుంచి బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని, ఎవరైనా అలా చేస్తే వారికి కాట్పా 2003 చట్టం కింద జరిమానా విధిస్తారని పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం సీపీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అన్ని పోలీసు స్టేషన్ల అధికారులతో అయన మాట్లాడారు. కాలేజీలు, స్కూళ్లకు వంద మీటర్ల దూరంలో పొగాకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుస్టేషన్ల వారీగా తనిఖీలు, సోదాలు నిర్వహించాలన్నారు. పాన్‌షాపుల్లో పొగాకు ఉత్పత్తులను పరిశీలించాలన్నారు. అక్కడ అమ్మకాలు జరిగితే జరిమానాలు విధించాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం డీఎంహెచ్ కార్యాలయంలో కూడా సమావేశం జరిగింది. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు కూడా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హారిక, సోషల్ వర్కర్ రేవతి, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పైడా కళాశాల వార్షికోత్సవం


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

దాబాగార్డెన్స్: పైడా కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ప్రేమసమాజం ఆడిటోరియంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, రాజ్ మతాజ్ సీఈవో డాక్టర్ మీనాక్షి అనంతరామ్, మ్యాక్ అసెథిటిక్స్ ఇండియా వ్యవస్థాపక చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీవల్లి కొత్రపాటి, సాయి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ సెక్రటరీ, కరస్పాండెంట్ క్రాంతి సుధా మేకా, పైడా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లడం ద్వారా అత్యున్నత శిఖరాలు చేరుకోవచ్చని సూచించారు. పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి స్థాయిలో ఉంటే.. ఆ కుటుంబాలు ధృఢంగా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్ తన సందేశం విద్యార్థులకు అందజేశారు. ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.